'పది'సన్నద్ధతకు స్పెషల్ పరీక్ష

గ్రాండ్ టెస్టు మాదిరిగా... వచ్చే నెల 5 నుంచి ప్రత్యేక పరీక్ష

- ఫిబ్రవరి 19 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలకూ షెడ్యూల్ ఖరారు
- మార్చి 18 నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు
- మేడ్చల్ జిల్లాలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య 46,838



సాక్షి, మేడ్చల్ జిల్లా: పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభమవుతుండటంతో.. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ షెడ్యూల్ ఖరారు చేసింది. అయితే.. అంతకు ముందు విద్యార్థులను మరింతగా పరీక్షలకు సిద్ధం చేయటానికి గతంలో గ్రాండ్ టెస్టులను జిల్లా విద్యాశాఖ నిర్వహించింది.ఈ విద్యా సంవత్సరంలోనూ గ్రాండ్ టెస్టు మాదిరిగానే స్పెషల్ (ప్రత్యేక) పరీక్షలను ఫిబ్రవరి 5 నుంచి 12 వరకు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ విద్యాసంవత్సరంలో 'పది'లో ఉత్తమ ఫలితాల సాధన ధ్యేయంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కృషి చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే ఎస్సీఈఆర్టీ 'లక్ష్యం' పేరిట ఈ విద్యా సంవత్సరంలో రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు పదో తరగతి వార్షిక పరీక్షలకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ,ఎయిడెడ్,ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 46,838 మంది విద్యార్థులను మరింత సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక(స్పెషల్) పరీక్ష నిర్వహణకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్ర పాఠశాల విద్యాధికారులు పంపిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక మేరకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ పేర్కొంది. ఈ పరీక్షలను మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షించనున్నారు.

ప్రత్యేక పరీక్షలకు సూచనలివే..

పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక(స్పెషల్) పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ కొన్ని సూచనలు చేసింది. ఇప్పటికే నిర్వహించిన సంగ్రహణాత్మక పరీక్ష–1లో ఇవ్వని సిలబస్‌లోని పాఠ్యాంశాల ప్రశ్నలు ఉండాలని తెలిపింది. అక్టోబర్ నుంచి జనవరి సిలబస్‌కు సంబంధించినవిగా ఉండాలని పేర్కొంది. షెడ్యూల్ ప్రకారం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాల్సి ఉంటుంది. పరీక్ష పూర్తి కాగానే వెంటనే సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాలి. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు సంబంధిత విషయాలపై ఉపాధ్యాయులు రెమిడియల్(పునశ్చరణ) తరగతులను నిర్వహించాల్సి ఉంటుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా ఆదివారం నాచారం పారిశ్రామికవాడలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. 11 కేవీ టైర్ ఫీడర్ పరిధిలోని రోడ్ నెంబర్ 5, 6, మల్లాపూర్, నాచారం ప్రధాన రహదారి అవురా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాగ్యనగర్ ఫీడర్ పరిధిలో రోడ్ నెంబర్ 8, నాచారం ప్రధాన రోడ్డు, సింగం చెరువు తండా ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ప్రసాద్ ఆస్పత్రిలైన్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్–2, పలు ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ పృథ్వీరాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బెర్కో, పాయినీర్, పాలిమర్ ఇండస్ట్రీస్, దేవి హైటెక్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ సాధించాలి



రామంతాపూర్ : బీఆర్ఎస్ హబ్సిగూడ డివిజన్ కార్యకర్తలు, నేతలతో కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ బి.వి.చారి, ప్రధాన కార్యదర్శి కంచర్ల సోమిరెడ్డిలు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ సర్కిల్‌లో హబ్సిగూడ డివిజన్‌లోనే టీఆర్ఎస్ అభ్యర్థికి అత్యధిక ఓట్లు పోలయ్యాయని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఈ డివిజన్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి అత్యధిక మెజారిటీ సాధించేలా ఐకమత్యంతో కార్యకర్తలు, కృషి చేయాలని కోరారు. సంజయ్ జైన్, యాదగిరి, కైలాసపతిగౌడ్, మనోహర్, శ్యామ్, శ్రీనివాస్, నరేంద్రరాజు, గణేష్, లింగం, రవీందర్, యాదమ్మ, రాజ్యలక్ష్మి, చందు తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని గ్రేటర్ సత్యానగర్ సంక్షేమ సంఘం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి గ్రేటర్ సత్యానగర్‌లో భూగర్భ డ్రైనేజీ నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. తమ కాలనీలో ఎన్నో ఏళ్లుగా భూగర్భ డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు జయం శ్రీనివాస్, నరసింహ, శివకుమార్, కె.శ్రీనివాస్, దయానంద్, వెంకటయ్య, ఆర్కేరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సేవారత్న అవార్డు ప్రదానం



మల్కాజిగిరి: దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకుడు వినయ్‌కు జాతీయ సేవారత్న అవార్డు లభించింది. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ జాతీయ కమిటీ వివిధ రాష్ట్రాల్లో సేవలందించిన వారిని గుర్తించి అవార్డు అందజేస్తారు. రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో అలనాటి నటి పూర్ణిమ, దైవజ్ఞశర్మ, ఆర్గనైజేషన్ ఛైర్మన్ సరోజనమ్మ అవార్డును ప్రదానం చేశారు.

గణతంత్ర పరేడ్‌లో రామంతాపూర్ విద్యార్థిని



రామంతాపూర్ : రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌కు చెందిన బిల్లా కంటి వెంకటేష్ కుమార్తె రేది బిళ్లకంటి నగరంలోని బద్రుక కళాశాల విద్యార్థిని శుక్రవారం న్యూఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవం పరేడ్‌లో ఆమె ఎన్‌సీసీ తరపున పాల్గొని అందరి ప్రశంసలు పొందింది. పరేడ్‌లో పాల్గొని ప్రతిభ చూపిన రేదిని స్థానికులతో పాటు పలువురు ప్రశంసించారు.

ఆర్డీఓ కార్యాలయంలో సమీక్ష

అల్వాల్: సైనిక్‌పురిలోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆర్డీఓ కార్యాలయంలో మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్ ఆధ్వర్యంలో శనివారం సబ్ డివిజనల్ లెవెల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ పైన జరుగుతున్న కేసులపై చర్చించారు. కేసుల గురించి సంబంధిత పోలీస్ ఉన్నతాధికారులు, తహసీల్దార్లు, ఐఓలు సమావేశానికి హాజరు కాకపోవడంతో ఆయన ఆగ్రహించారు. సోషల్ వెల్ఫేర్ అధికారి శ్రీకర్‌రెడ్డి, ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓలు నాగిరెడ్డి, వెంకటేష్, సాయిప్రకాష్‌గౌడ్, కృష్ణ, దేవి ఎంసీపీ సభ్యులు వెంకటేష్, రాజు, నవకిరణ్, సందీప్, రమేష్, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, పరమేష్, సుకాంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రాజు తదితరులున్నారు.

ఉప్పల్ రహదారి సమస్యపై మంత్రికి..



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే

ఉప్పల్: ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి నిర్మాణాన్ని వెంటనే పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర రోడ్డు భవనాల, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి సన్మానించారు. ఉప్పల్ – వరంగల్ జాతీయ రహదారితో ఏళ్ల తరబడి ఉప్పల్ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, సాయిజెన్ శేఖర్, గంధం నాగేశ్వర్‌రావు, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మచ్చేందర్‌కు నివాళి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే మచ్చేందర్ శుక్రవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డిలు అల్వాల్‌లో ఆయన పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. రాపర్తి, బబ్లు, పరమేష్, సందీప్, శర్నగిరి, అరుణ్, సెంథిల్ పాల్గొన్నారు.

గౌతంనగర్: కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే మచ్చేందర్ పార్థీవదేహానికి శనివారం గౌతంనగర్‌కు చెందిన సురేష్‌యాదవ్, గోపాల్, విఠల్‌రెడ్డి, నర్సింగ్‌రావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నియోజకవర్గానికి నిధులు కేటాయించండి



గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలు, మురికివాడల్లో అనేక సమస్యలు ఉన్నాయని, డ్రైనేజీ, రోడ్ల సమస్య ఉందని, శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు లేవన్నారు. వీటన్నింటికీ ప్రాధాన్యత క్రమంలో నిధులను కేటాయించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.



కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులు అలరించాయి. విజయవాడ నుంచి వచ్చిన కూచిపూడి కళాకారులు జంగం మనీషా చక్రవర్తి, జంగత శిరీషా శిష్య బృందంచే నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. పూర్వరంగం, గజాననయుతం, కళింగ నర్తన, శృంగార లహరి, బృందావన నిలయోహ, దశావతారాలు, శివాష్టకం, శివస్తుతి, జతిస్వరం లాంటి కార్యక్రమాలను శిరీష, పూజిత, తన్మయి, మౌనిక, సాత్విక తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

మెరుగైన సేవలు అందించాలి

కుషాయిగూడ: మెరుగైన సేవలందించి వినియోగదారుల మన్ననలు పొందాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. చర్లపల్లిలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ని శనివారం ఐలా ఛైర్మన్ రోషిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ సెంటర్‌లో అందించే ఆధార్ సవరణ, ఓటర్‌ఐడీ దరఖాస్తు, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తదితర పథకాలతో పాటు పలు ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. స్థానికనేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బత్తుల శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. శనివారం కాశీపురం, శ్రీసాయిసూర్య ఎన్‌క్లేవ్, న్యూద్వారకానగర్, న్యూఎస్ కాలనీ, గ్రీన్‌ల్యాండ్, స్రవంతినగర్, మురళీకృష్ణ నగర్, వెంకన్న కాలనీలు 9 కాలనీలతో కూడిన జేఏసీ పిలుపు మేరకు ఆయన అధికారులతో కలిసి కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, అంతర్గత రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యలు కాలనీవాసులు తెలిపారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. జలమండలి డీజీఎం సాంబయ్య, జేఏసీ ఛైర్మన్ మన్మధరెడ్డి, నాయకులు రమేష్, పరమేష్, నవీన్‌రెడ్డి, వీఎన్.రాజు, సరితరమేష్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, లక్ష్మీనర్సింగ్‌రావు, సతీష్‌రెడ్డి, రమేష్‌యాదవ్, సుకుమార్, తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, భూపతిరెడ్డి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

స్థానిక సమస్యలపై...

అల్వాల్: అల్వాల్ జేఏసీ కాలనీలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శనివారం జేఏసీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే జలమండలి జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. డీజీఎం సాంబయ్య, అల్వాల్ జేఏసీ కాలనీల అసోసియేషన్ అధ్యక్షుడు మన్మధరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ అసోసియేషన్, కాలనీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, పరమేష్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



అల్వాల్: యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం సైనిక్‌పురిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆటమ్న్ సెలూన్ వాణిజ్య కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆటమ్న్ సెలూన్ బిజినెస్ హెడ్ శ్రీధర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భారతమాతకు మహా హారతి

మల్కాజిగిరి: భారతమాత మహాహారతి కార్యక్రమం మల్కాజిగిరి చౌరస్తాలో శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. స్వచ్ఛ భారత్ అభియాన్ మల్కాజిగిరి అసెంబ్లీ కన్వీనర్ బక్క నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రామేశ్వర్‌జీ, దేవదాస్, దాసస్, గౌలికర్ ఆనంద్, హరిరాజు, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

'అతి ఉత్కృష్ట్ సేవా పతకం' ప్రదానోత్సవం



హెడ్ కానిస్టేబుల్ నర్సింహులు, హోంగార్డు రమేష్‌చందర్‌లకు ప్రదానం చేస్తున్న ఇన్‌స్పెక్టర్

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రతిభ కనబరిచిన ఇద్దరికి రాచకొండ కమిషనర్ 'అతి ఉత్కృష్ట సేవ ' పతకాన్ని ప్రకటించారు. హెడ్ కానిస్టేబుల్ నర్సింహులు, హోంగార్డు రమేష్‌చందర్‌లకు సేవా పతకాలను మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రామంతాపూర్ : మూసీ నాలాపై నిర్మిస్తున్న వంతెన పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ నాలాపై నిర్మాణం చేశామని, త్వరలోనే ఐదో బ్రిడ్జి పనులు పూర్తవుతాయన్నారు. మూసీ నాలాలో చెత్తా, చెదారం వేయకుండా జీహెచ్ఎంసీ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులు నాగేందర్, నాగమణి, శ్వేతాశ్రీ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు వేధింపులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ఉప్పల్: హోంగార్డు వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ సత్యానగర్‌లో నివాసముంటున్న శ్రీనివాస్(50) హౌస్ కీపింగ్ మెటీరియల్ తయారు చేస్తుంటాడు. అతడి ఇంటిపక్కనే నివసిస్తున్న నాగరాజు(45) హోంగార్డుగా పనిచేస్తుంటాడు. మాజీమంత్రి మహమూద్ అలీ వద్ద, అంతకు ముందు మాజీ హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి వద్ద పని చేసేవాడు. స్థానికంగా ఉంటున్న వారిని కూడా తనకు పలుకు బడి ఉందంటూ.. చిన్న చిన్న విషయాలను పెద్దగా చేసి బెదిరింపులకు పాల్పడేవాడు. ఇదే క్రమంలో శ్రీనివాస్‌ను గత నాలుగేళ్లుగా అనేక విధాలుగా వాహన పార్కింగ్ వద్ద చిన్న విషయాన్ని పెద్దవి చేస్తూ.. వేధింపులకు గురి చేస్తుండేవాడు. వేధింపులు తీవ్రం చేయడంతో శనివారం పురుగుల మందు తాగి శ్రీనివాస్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బంధువులు పెద్దఎత్తున శ్రీనివాస్ ఇంటికి చేరుకుని నాగరాజు ఇంటిని చుట్టు ముట్టారు. నాగరాజు ఇంట్లో ఉన్నాడన్న సమాచారంతో ఇంటిముందు మృతదేహంతో ఆందోళనకు దిగారు. దీంతో సత్యనగర్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కబెడుతున్నట్లు సమాచారం.

వాహనాలను తీసుకెళ్లండి

మల్కాజిగిరి: రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 80 గుర్తు తెలియని (అన్‌క్లెయిమ్‌డ్) ద్విచక్ర వాహనాలను సంబంధిత యజమానులు తీసుకెళ్లాలని ఇన్‌స్పెక్టర్ శివశంకర్ సూచించారు. నిబంధనలకు లోబడి వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 8712662463.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



రామంతాపూర్ : దేశవ్యాప్తంగా ఇటీవల నిర్వహించి నర క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో రామంతాపూర్ శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శనివారం జోన్ ఏజీఎం సతీష్ విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని వెలికితీయడానికి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, డీన్ నాగరాజు, మల్లికార్జున్ నాయుడు, పుల్లారావు, రాజేంద్రప్రసాద్, అరుణ్‌కుమార్, వీరాంజనేయులు, కనకయ్య పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తా..

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



శివనగర్‌కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కుషాయిగూడ: కాలనీ అభివృద్ధికి తన సంపూర్ణ తోడ్పాటును అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్, శివనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని శనివారం ఆయన స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కాలనీవాసులు, ప్రజాప్రతినిధులకు వారధులుగా పనిచేసి సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. సమిష్టిగా ఉండి కాలనీ అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. కాలనీ అవసరాలు, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. స్థానికనేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, బత్తుల శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ప్రణయ్‌రాజ్‌కు ప్రథమ స్థానం



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ప్రణయ్‌రాజ్

ఉప్పల్: డబ్ల్యూపీసీ తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో ఉప్పల్‌కు చెందిన ప్రణయ్‌రాజ్ ప్రథమస్థానం సాధించారు. డబ్ల్యూపీసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఇంటూరి రేఖ ఆధ్వర్యంలో రామచంద్రాపురం కొల్లూరులో వీడీఎల్ ఫిట్నెస్ సొల్యూషన్స్ తెలంగాణ రెండో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా నుంచి ప్రణయ్‌రాజ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో టీన్‌త్రీ అండర్–60 కిలోల కేటగిరి డెడ్‌లిఫ్ట్‌లో 140 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 64 కిలోలు, పుష్‌పుల్‌లో 205 కిలోల బరువు ఎత్తి మూడు పోటీల్లో ప్రథమ స్థానం సాధించాడు. సిమ్ లయన్ ఫిట్‌నెస్ సెంటర్ ద్వారా కోచింగ్ తీసుకుని కోచ్ ఇచ్చిన మెలుకువలతోనే ముందుకు సాగినట్లు ప్రణయ్ తెలిపారు.

ఆకట్టుకున్న అకడమిక్ ఫెయిర్



ఎగ్జిబిట్‌లను తిలకిస్తున్న సుమన్ లతా, ప్రవీణా, కరస్పాండెంట్ రిజ్వాన్ అన్సారీ

మల్లాపూర్: నాచారం కమలా మోమోరియల్ హైస్కూల్లో రిపబ్లిక్ డేను పురస్కరించుకుని 2024 అకడమిక్ ఫెయిర్‌ను నిర్వహించారు. విద్యార్థులు అడవులు, నేలలు, సూర్యరశ్మి, సైన్స్‌అండ్ టెక్నాలజీ, జంతుసంరక్షణ, సోలార్, రోబోటిక్, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, ఖగోళం వంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథులుగా ఓయూ జైనిటిక్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుమన్ లతా, మాను ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణా శాలిహేలు హాజరై ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి అకాడమీక్ ఫేయిర్‌లు ఉపయోగపడతాయన్నారు. నేటి సమాజంలో నైతిక మానవ విలువల గురించి విద్యార్థులు చక్కగా ప్రదర్శనలతో వివరించారన్నారు. విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల కరస్పాండెంట్ రిజ్వాన్ అన్సారీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, డీఈ

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేష్‌యాదవ్ అన్నారు. వాసవీనగర్ కాలనీ చౌరస్తా నుంచి మెయిన్‌రోడ్డు వరకు రూ.12.50 లక్షలతో వేస్తున్న బీటీ రోడ్డు పనులను ఆయన డీఈ శారదతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన నాలుగేళ్లలో తాగు నీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు వెల్లడించారు. డివిజన్‌లో మిగిలిన పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, కాలనీవాసులు కోటేశ్వరరావు, మిట్టపల్లి సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నామాల రవి, సుభాష్, బుచ్చయ్య, సహోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



సైన్స్‌ఫేర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల మేదస్సుకు పదునుపెట్టి రూపొందించిన ఎగ్జిబిట్స్ అందరిని ఆకట్టుకున్నాయి. చక్రిపురం చౌరస్తాలోని శ్రీ చక్రి విద్యానికేతన్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శనలో ఉంచిన ఎగ్జిబిట్స్‌ను తిలకించారు. విద్యార్థులు వాటి పనితీరుపై వివరించిన తీరును వారు అభినందించారు. ఇలాంటి ప్రదర్శనలతోనే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం అందజేయాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మొలుగు ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.